సాక్షి ఖమ్మం

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



హడలెత్తిస్తూ వసూళ్లు

ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లలో తనిఖీల పేరిట డబ్బు వసూలు చేస్తున్న ఐదుగురిపై కామేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. 8లో



మోడల్ స్కూల్ పిలుస్తోంది..

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈనెల 22వ తేదీతో ముగియనుంది. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 20°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లాకు భారీగా ఎంపీ నిధులు

- మూడు నియోజకవర్గాలకు రూ.2.10 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆయా ప్రాంతాల అభివృద్ధికి భారీమొత్తంలో నిధులు మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, స్కూళ్లు, అంగన్‌వాడీ, హెల్త్ సబ్ సెంటర్ల ప్రహరీల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ నిధుల నుండి రూ.2,10,60,000 విడుదల చేశామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లోని రఘునాథపాలెం, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, నేలకొండపల్లి, తిరుమలాయపాలెంతో పాటు భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు(కొత్తూరు)ల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనుండగా, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని ఎంపీ వివరించారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓగా సుబ్బారావు



డాక్టర్ వి.సుబ్బారావు

ఖమ్మం వైద్య విభాగం: జిల్లా ఇన్‌చార్జ్ వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ వరికూటి సుబ్బారావును నియమిస్తూ కలెక్టర్ గౌతమ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆయన విధుల్లో చేరారు. సీనియర్ పల్మనాలజీ వైద్యుడైన సుబ్బారావు జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్‌గా, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతికి కాలికి గాయం కావడంతో ఆమె సెలవులో వెళ్లగా, దీంతో రామూనాయక్‌కు గతనెల 31వ తేదీన ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే, ఆయన వ్యక్తిగత కారణాలతో తప్పుకున్న నేపథ్యాన సుబ్బారావును ఇన్‌చార్జ్‌గా నియమించారు.

మోసగాళ్ల వలలో పడకండి



ఫిర్యాదుల వివరాలు తెలుసుకుంటున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం: రెట్టింపు నగదు చెల్లిస్తామంటూ స్కీంలతో వచ్చే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే ఇన్వెస్ట్‌మెంట్ స్కీం పేరుతో రూ.లక్షల పెట్టుబడి పెట్టించి దివ్యాంగులను మోసం చేశారని నగరానికి చెందిన పలువురు సీపీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేసి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాగా, గ్రీవెన్స్ డేలో 25 మంది ఫిర్యాదులు అందగా ఎక్కువగా భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ సందర్భంగా సీపీ సునీల్‌దత్ ఫిర్యాదులను పరిశీలించి విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

28న కేఎంసీ బడ్జెట్ సమావేశం

- రూ.181 కోట్లతో ప్రతిపాదనలు

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌ను ఆమోదించేందుకు ఈనెల 28న సమావేశ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలపై ఇప్పటికే కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్ సురభి చర్చించగా.. తాజాగా మేయర్ పునుకొల్లు నీరజతోనూ అధికారులు చర్చించినట్లు తెలిసింది. ఈమేరకు రూ.181 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. కాగా, కేఎంసీకి సొంత నిధుల కింద రూ.80 కోట్లు సమకూరనుండగా, ప్రభుత్వం నుండి రూ.101 కోట్ల నిధులు వస్తాయని అంచనాల్లో పొందుపర్చినట్లు తెలిసింది. కేఎంసీకి సొంతంగా వస్తుందని పేర్కొన్న ఆదాయంలో ఆస్తి పన్నుల ద్వారా రూ.30 కోట్లు, టౌన్ ప్లానింగ్ కింద రూ.30 కోట్లు, నల్లా పన్నుల ద్వారా రూ.9.50 కోట్లు, ట్రేడ్ లైసెన్, ఇతరత్రా మార్గాల్లో రూ.10 కోట్ల వరకు సమకూరుతాయని అంచనా వేశారు. ఇందులో వేతనాలు, విద్యుత్‌బిల్లులు, హరితహారం, ఓఅండ్‌ఎం తదితర అంశాలకు రూ.65 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనాల్లో పేర్కొన్నారు. దీంతో సొంత ఆదాయంలో మిగిలే సుమారు రూ.15 కోట్లను కేఎంసీ పరిధిలో అభివృద్ధి పనులకు వినియోగించవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. కాగా, 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.220 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇందులో రూ.40 కోట్లు తగ్గించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

సమ్మక్కా.. నువ్వే సూడాలే !

రెండేళ్ల క్రితం సకిని రామచంద్రయ్య పేరు ఊరూవాడ మార్మోగింది. నిరక్షరాస్యుడైనా తనలో దాగి ఉన్న కళతో కేంద్రాన్ని మెప్పించి పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యాడు. అతని ప్రతిభకు మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలంతోపాటు నిర్మాణానికి రూ.కోటి ఆర్థిక సాయం ప్రకటించింది. అయితే నేటికీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. ఆ సమ్మక్క తల్లి అయినా కరుణించి తన సమస్య తీర్చాలని రామచంద్రయ్య కోరుతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



దోలు వాయిద్యంతో సకిని రామచంద్రయ్య

హామీ నెరవేర్చండి

ఆర్థిక సాయం కోసం రెండేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. కలెక్టర్ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని చెబుతున్నారు. వాటిని మాకు అందివ్వాలంటే ఫైనాన్స్ సెక్రటరీ నుంచి అనుమతి రావాలంటున్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత కలెక్టర్ ప్రియాంక ఆల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా ఇంటి స్థలం విషయంలో సర్వే నిర్వహించారు. ఆర్థిక సాయం విషయాన్ని ఫైనాన్స్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆర్థిక సాయం అందివ్వాలి.

– పద్మశ్రీ సకిని రామచంద్రయ్య



అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు స్వీకరిస్తున్న రామచంద్రయ్య

వనదేవతల వీరగాథలు చెప్పే 'సకిని'

- రామచంద్రయ్యకు 2022లో పద్మశ్రీ ప్రకటించిన కేంద్రం
- ఆ తర్వాత రాష్ట్రభుత్వం తరఫున రూ.కోటి ఆర్థిక సాయం ప్రకటన
- రెండేళ్లు గడిచినా నేటికీ నెరవేరని హామీ

'కంచు' కంఠం ఆయన సొంతం

మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన సకిని రామచంద్రయ్య ఆదివాసీ సంస్కృతిలో భాగమైన కంచు మేళం, కంచు తాళం (డోలు వాయిద్యం) సాయంతో వనదేవతల వీరగాథలు చెప్పడంలో దిట్ట. ముఖ్యంగా రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజుల వంటి ఆదివాసీల దేవేరుల కథను కళ్లకు కట్టినట్టుగా గానం చేస్తారు. మేడారం జాతర సందర్భంగా చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తీసుకొచ్చేప్పుడు ఆయన కీలకంగా వ్యవహరిస్తారు. రామచంద్రయ్య ప్రతిభను గుర్తించిన కేంద్రం 2022 జనవరి 25న పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నాటి సీఎం కేసీఆర్ స్పందించారు. 2022 ఫిబ్రవరి 1న రామచంద్రయ్యను హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు పిలిపించుకుని మాట్లాడారు.

వృద్ధాప్య పింఛనే దిక్కు

ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని అమలు చేయాలని కోరుతూ రెండేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పద్మశ్రీ రామచంద్రయ్య ఫైల్‌కు మోక్షం లభించడం లేదు. ఎట్టకేలకు గత డిసెంబర్‌లో కొత్తగూడెంలో 426 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు సర్వే చేశారు. ఇంకా పత్రాలు మాత్రం ఇవ్వలేదు. రామచంద్రయ్యతోపాటు పద్మశ్రీ పురస్కారాలు పొందిన కిన్నెర మొగిలయ్య, గుస్సాడి కనకరాజుకు ఇంటి స్థలంతోపాటు కోటి రూపాయల ఆర్థిక సాయం అప్పటికప్పుడే అందింది. కానీ రామచంద్రయ్య విషయంలోనే జాప్యం జరుగుతోంది. కనీసం కళాకారులకు అందించే రూ.10వేల పింఛన్ సైతం ఆయనకు అందడం లేదు. గతంలో ఈ విషయంపై తెలంగాణ సాంస్కృతిక సారథికి పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. రెండెకరాల పొలం, రూ.రెండు వేల వృద్ధాప్య పింఛన్‌పైనే ఆధారపడి రెండు గదుల ఇందిరమ్మ ఇంట్లో ఆయన జీవిస్తున్నారు.

అప్పు చేసి ఆస్పత్రికి..

రామచంద్రయ్య ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. దీంతో హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం చేయించేందుకు ఆ కుటుంబం రూ.4 లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. కంచు తాళం, కంచు మేళంతో ఆదివాసీ కథలు చెప్పే ఏకైక కళాకారుడు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం రామచంద్రయ్య ఒక్కరే ఉన్నారు. అలాంటి కళాకారుడికి అండగా నిలవడంలో జరుగుతున్న జాప్యానికి ఇకనైనా స్వస్తి పలకాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.

అందని ఇంటి స్థలం, రూ.కోటి నగదు

రామచంద్రయ్య కుటుంబ ఆర్థిక స్థితిగతులపై కేసీఆర్ ఆరా తీశారు. ఆదివాసీ కళలు అంతరించి పోకుండా కాపాడుతున్నందుకు మెచ్చుకున్నారు. అప్పటికప్పుడు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఇంటి స్థలం కేటాయిస్తామని చెప్పారు. స్థలం ఇచ్చినా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదని చెప్పడంతో ఇంటి నిర్మాణానికి రూ.కోటి ఆర్థిక సాయాన్ని స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం తరఫున అందిస్తామని ప్రకటించారు. స్వయానా ముఖ్యమంత్రి నుంచి హామీ రావడంతో రామచంద్రయ్య సంతోషించారు. కానీ, ఆ హామీల అమలులో ఇప్పటికీ జాప్యం జరుగుతూనే ఉంది.

కాంగ్రెస్ పాలనలోనే గిరిజనుల సంక్షేమం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

సేవాలాల్ జయంతి వేడుకలో మంత్రి పొంగులేటి

కూసుమంచి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గిరిజనులకు సంక్షేమ ఫలితాలు అందుతాయని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు సోమవారం కూసుమంచిలో నిర్వహించగా మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ హింస, మద్యపాన నిషేధం తదితర అంశాలపై సేవాలాల్ సమాజ హితానికి పాటుపడి భగవంతుడిగా మారారని తెలిపారు. కూసుమంచిలో సేవాలాల్ ఆలయంతో పాటు ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఇందిరాగాంధీ హయాంలోనే బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చగా, రిజర్వేషన్ ఫలాలతో గిరిజనులు విద్యా, ఉద్యోగ అవకాశాలను పొందగలుగుతున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి, గిరిజనులకు విడలేయని బంధం ఉందని.. అందుకే తాజా ఎన్నికల్లో గిరిజనులు కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేస్తుండగా మరో రెండు త్వరలో అమలు కానున్నాయని పొంగులేటి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ గణేష్, పాలేరు ప్రత్యేకాధికారి కొండపల్లి శ్రీరామ్, గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయలక్ష్మి, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, బోడ మంగీలాల్, రమ్య, తహసీల్దార్లు సురేష్, రాంప్రసాద్, రామకృష్ణ, గౌరీశంకర్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డితో పాటు గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

హెలీకాప్టర్‌లో మేడారానికి...

కూసుమంచిలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి మేడారంలో పలు ప్రారంభోత్సవాలకు హాజరయ్యేందుకు గాను హెలీకాప్టర్‌లో బయలుదేరారు. నాయకన్‌గూడెం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కారులో వచ్చిన ఆయన అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో మేడారం వెళ్లారు. కాగా, హెలీప్యాడ్ వద్ద కూసుమంచి, సూర్యాపేట జిల్లా మోతె పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'గ్రీవెన్స్' ఫిర్యాదులకు ప్రాధాన్యత

- ఎప్పటికప్పుడు పరిశీలన, పరిష్కారం
- ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ గౌతమ్



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు, ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన గ్రీవెన్స్ డేలో భాగంగా ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో జరిగే గ్రీవెన్స్‌కు జిల్లా నుంచి ఫిర్యాదులు వెళ్తుండడంపై ఆరా తీశారు. ఇక్కడ అందే దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ కనబరిస్తే ఈ పరిస్థితి ఎదురు కాదని తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ గణేష్, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, డీపీఓ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడికక్కడే పరిష్కారం

ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరం రెవెన్యూ పరిధి సర్వే నం 402/35/1/1లో 33 కుంటల భూమి నమోదు కాకపోవడం, తిరుమలాయపాలెం మండలానికి చెందిన మిట్టకోల భద్రయ్య తనకు హస్నాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 116/ఈలో 1.20ఎకరాల పట్టాల్యాండ్ నుండి అసైన్డ్ ల్యాండ్‌గా నమోదైందని, బీరోలుకు చెందిన మన్నెపల్లి అశోక్‌కు బీరోలు రెవెన్యూ పరిధి సర్వే నంబర్131/ఎ2, 135/ఎ1/2లో భూమి నిషేధిత జాబితాలో నమోదైందని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో ఆయన అక్కడికక్కడే దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించారు.

ఫిర్యాదులు కొన్ని...

ఇటీవల ప్రజాపాలన దరఖాస్తులను డేటా ఎంట్రీ చేసిన తమకు ఇవ్వాల్సిన నగదు ఇప్పించాలని అనిల్‌నాయక్, టి.శశికుమార్, అశోక్, చైతన్య, గణేష్ తదితరులు కోరారు. కొణిజర్ల మండలం పెద్ద మునగాలకు చెందిన కొదుమూరు నాగ వెంకటేశ్వరరావు తన 3–29 ఎకరాల భూమిని భార్యాపిల్లలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నందున తిరిగి ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన గత్తం మౌనిక, దారా కృష్ణవేణి, కట్టా రాజకుమారి, దారా నాగకన్య తదితరులు అంబేద్కర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై ఫిర్యాదు చేయగా, మధిర మండలంకు చెందిన యలగందుల గోపీచంద్ సదరం సర్టిఫికెట్, పింఛన్ ఇప్పించాలని, ఖమ్మం కొత్తగూడెంకు చెందిన వరికుప్పల కృష్ణవేణి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన దొడ్డ శ్రీనివాసరెడ్డి తన భూమి మీదుగా దారి ఇవ్వడంతో విభేదాలు వస్తున్నందున సర్వే చేసి డొంక మార్గం నిర్ధారించాలని విన్నవించారు.

ప్రతీ వారం సమావేశాలు నిర్వహించండి

తుది ఓటరు జాబితా విడుదల చేసిన నేపథ్యాన ప్రతీ వారం పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలను స్వీకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై నిబంధనలకు లోబడి వ్యవహరించామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఆర్డీఓలు జి.గణేష్, అశోకచక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీఏఓ విజయనిర్మల, సీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రెయినర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి రాంబాబు, తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు, హాస్టళ్లలో తహసీల్దార్ల తనిఖీ



వైరా ఎస్సీ హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లావ్యాప్తంగా గురుకులాలు, ప్రభుత్వ సంక్షేమ శాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వసతిగృహాల్లో తహసీల్దార్లు తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం సాయంత్రం మొదలైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. తిరుమలాయపాలెం, జల్లెపల్లి, వైరా, నాగులవంచ, మధిర, కల్లూరు, ఏన్కూరు, వేంసూరు, తదితర మండలాల్లోని వసతిగృహాలకు వెళ్లిన తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు స్టోర్ రూమ్, వంట గదులు, బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. అలాగే, విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీ చేస్తుండడంతో సంక్షేమ అధికారులు అప్రమత్తమైనట్లు తెలిసింది. విద్యార్థులు లేకుండానే హాజరు వేస్తున్న వారు ఆందోళన చెందినట్లు సమాచారం. కాగా, కలెక్టర్ ప్రధానంగా గురుకులాల్లో తనిఖీలు చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. దీంతో తహసీల్దార్లతో పాటు రెవెన్యూ ఉద్యోగులు బృందాలుగా విడిపోయి గురుకులాలు, హాస్టళ్లలోనూ తనిఖీ చేసినట్లు సమాచారం.

మధిర కోర్టు భవన నిర్మాణానికి రూ.24 కోట్లు

మధిర: మధిరలో కోర్టు భవన సముదాయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.24 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలోనే కోర్టు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా మంజూరు కాలేదు. దీంతో మధిర బార్ అసోసియేషన్ బాధ్యులు పలుమార్లు మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క కలిసి సమస్యను వివరించారు. ఇంతలోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ వాసంశెట్టి కోటేశ్వరరావు, న్యాయవాది చావలి రామరాజు తదితరులు భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎరుపెక్కిన మార్కెట్ !

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి పోటెత్తింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు రావడంతో రైతులు భారీగా మిర్చి తీసుకొచ్చారు. ఎర్రమిర్చి 52,388 బస్తాలు, తాలు మిర్చి 8,632 బస్తాలు విక్రయానికి రాగా, ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని మార్కెట్ అధికారులు వెల్లడించారు. – ఖమ్మం వ్యవసాయం

- ఖమ్మం మార్కెట్‌కు 60వేల బస్తాలకు పైగా మిర్చి
- ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, ఏపీ నుంచి సైతం రాక
- ధర వెనకడుగు వేస్తుండడంతో రైతుల్లో ఆందోళన



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

రెండో కోత పంట విక్రయాలు

మొదటి కోత కంటే రెండో కోతలో మిర్చి దిగుబడి ఎక్కువగా ఉంటుంది. జనవరి వరకు రైతులు మొదటి కోత పంటను విక్రయించగా, ప్రస్తుతం రెండో కోతలు కొనసాగుతోంది. ఈ పంట నాణ్యతగా ఉండడమే కాక దిగుబడి కూడా ఎక్కువగా ఉండడంతో విక్రయాలు పెరుగుతున్నాయి. జనవరి నెలారంభంలో రోజుకు 15 వేల బస్తాల మిర్చి రాగా, రెండో వారం 25 వేలు, మూడో వారానికి 30 వేలు, చివరి వారానికి 35 వేల బస్తాలు దాటాయి. ఇక ఈనెల మొదటి వారం 40 వేల బస్తాలకు చేరగా, ప్రస్తుతం 60వేల బస్తాలకు పైగా మిర్చి వస్తోంది.

వెనకడుగు వేస్తున్న ధర

మిర్చి విక్రయాలు పెరుగుతుండగా ధర మాత్రం వెనకడుగు వేస్తోంది. ఖమ్మం మార్కెట్‌లో సోమవారం మిర్చి జెండాపాట ధర రూ. 20,850గా పలికింది. మోడల్ ధర రూ.19వేలు, కనిష్టంగా రూ.14వేల ధర నమోదైంది. గత సోమవారం రూ.22,300గా పలికిన ధర వారం వ్యవధిలో ఏకంగా రూ.1,350 తగ్గడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక తాలు మిర్చి ధర గరిష్టంగా రూ.12వేలుగా నమోదు కాగా, మోడల్ ధర రూ.10,800, కనిష్ఠ ధర రూ.7వేలుగా పలికింది.

ఆర్డర్లు ఆశాజనకంగా లేకే...

తేజా మిర్చి విదేశీ ఎగుమతులకు పెట్టింది పేరు. ప్రధానంగా చైనా నుంచి ఈ పంటకు ఆర్డర్లు వస్తాయి. కానీ ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవటంతో ఎగుమతిదారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ధర తగ్గుతోందని తెలుస్తోంది. విదేశాల నుంచి అరకొరగానే ఆర్డర్లు ఉండటంతో వ్యాపారులు పెద్దగా కొనుగోళ్లకు ఆసక్తి చూపడం లేదు. కొందరు వ్యాపారులు మాత్రం భవిష్యత్‌లో ధర పెరుగుతుందనే భావనతో కొనుగోలు చేసి కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేస్తున్నారు.

నేడు కొనుగోళ్లకు విరామం?

ఖమ్మం మార్కెట్‌లో మంగళవారం మిర్చి కొనుగోళ్లకు విరామం ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌కు సోమవారం భారీగా మిర్చి రావడంతో రాత్రి వరకు కూడా తరలింపు పూర్తికాలేదు. దీంతో చాంబర్ బాధ్యులు మంగళవారం మిర్చి కొనుగోళ్లకు సెలవు ఇవ్వాలని అధికారులను కోరగా, రాత్రి వరకు కూడా నిర్ణయాన్ని ప్రకటించలేదు. కానీ వ్యాపారులు మాత్రం మంగళవారం మిర్చి కొనుగోళ్లు నిర్వహించడం లేదని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుండగా, కమీషన్ వ్యాపారులు తమ పరిధిలోని రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చారు.

పొరుగు జిల్లాలు, పొరుగు రాష్ట్రం నుంచి..

తేజా మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్ పెట్టింది పేరు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలే కాక ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు సైతం ఇక్కడకు మిర్చి తీసుకొస్తున్నారు. తేజా మిర్చి విదేశీ ఎగుమతులకు అనుకూలమైనందున ఎగుమతిదారులు ఖమ్మం మార్కెట్‌పై దృష్టి సారిస్తారు. అయితే, ప్రస్తుతం దేశీయ అవసరాలకే విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి.

క్లుప్తంగా

సీపీని కలిసిన రూరల్, ట్రాఫిక్ ఏసీపీలు



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏసీపీలు తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు

ఖమ్మంక్రైం: తాజాగా బదిలీపై వచ్చిన ఖమ్మం రూరల్, ట్రాఫిక్ ఏసీపీలుగా తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు సోమవారం వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణపై ఏసీపీలకు సీపీ పలు సూచనలు చేశారు.

నేడు వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ఎన్నిక మంగళవారం నిర్వహించనున్నారు. గతంలో చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషణంపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టగా, గత నెల 27న నిర్వహించిన సమావేశంలో తీర్మానం నెగ్గింది. దీంతో ఆయన వీ.వీ.పాలెం సొసైటీతో పాటు డీసీసీబీ చైర్మన్ పదవి కోల్పోయారు. ఈమేరకు వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించగా, కొత్త చైర్మన్ ఎన్నికకు మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. కాగా, సొసైటీ చైర్మన్‌గా రావూరి సైదబాబును ఎన్నుకోనున్నట్లు సమాచారం.

బాధ్యతలు స్వీకరించిన పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి



ఈఈని సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా గుర్రాల వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లాలోని పలు సర్కిళ్లలో పనిచేసిన ఆయన ఇటీవల ఈఈగా నియమితులయ్యారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డిఎస్‌ఈ రామ చంద్రమౌళి, డీఈ కేవీకే.నివాస్ తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి స్పెల్ విజర్డ్ - డ్రామా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన పిండిప్రోలు విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలాయపాలెం: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా)ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి స్పెల్ విజర్డ్ - డ్రామా పోటీలు నిర్వహించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు జెడ్పీహెచ్‌ఎస్, అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఖమ్మం డైట్ అధ్యాపకుడు వైజీకే.మూర్తి, పద్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె.శరత్‌బాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు ఎల్టా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు జె.జగదీష్, ఎస్.కే.దస్తగిరి ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడగా ఎన్నెస్పీ పాఠశాల హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు ఎల్టా బాధ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎస్.రవికుమార్, రామనాథం, మీరా హుస్సేన్, ఎం.డీ.ముజీబ్, ఎం.డీ.షఫీ ఎస్.నాగేశ్వరరావు, సైదులు, జయరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రస్థాయి ఎంపికైన పిండిప్రోలు విద్యార్థులు, వారికి గైడ్‌గా వ్యవహరించిన ఇంగ్లిష్ ఉపాధ్యాయిని నిర్మలను హెచ్‌ఎం లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. అపోలో హోం హెల్త్ కేర్ లిమిటెడ్‌లో వంద ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. 18నుంచి 40 ఏళ్ల నిండిన వారు హోం కేర్ నర్స్ పోస్టుల భర్తీకి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,300	7,550
కందులు	9,500	9,500
మిర్చి	20,850	14,000
మిర్చి తాలు	12,000	7,000
పత్తి	7,000	5,500

– ఖమ్మం వ్యవసాయం

ఇటు కటకట.. అటు వెలవెల



ఖమ్మం పాత బస్టాండ్‌లో పెద్దసంఖ్యలో వేచిఉన్న ప్రయాణికులు

ములుగు జిల్లా మేడారంలో బుధవారం మొదలుకానున్న సమ్మక్క - సారలమ్మ జాతరకు ఆర్టీసీ ఆదివారం నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. రీజియన్‌లోని 90శాతం మేర బస్సులను మేడారానికే కేటాయించిన అధికారులు పలు రూట్లలో రోజువారీ బస్సులు రద్దుచేశారు. అయితే, మేడారానికి రద్దీ మొదలు కాకముందే అధికారులు ఈ నిర్ణయం తీసుకోగా, రోజువారీ పనులపై వెళ్లివచ్చే ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈమేరకు సోమవారం ఖమ్మం పాత బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు గంటల తరబడి ఎదురుచూస్తూ వచ్చిన ఒకటి, రెండు సర్వీసులు ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఇక మేడారం వెళ్లే బస్సులు మాత్రం పదుల సంఖ్యలో కూడా లేని ప్రయాణికులతోనే బయలుదేరడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



మేడారం వెళ్తున్న బస్సులో పలుచగా ఉన్న ప్రయాణికులు



గార్ల - ఇల్లెందు బస్సు ఎక్కేందుకు పోటాపోటీ



మేడారం జాతర కోసం కొత్త బస్టాండ్‌లో సీరియల్‌లో ఉంచిన బస్సులు

హడలెత్తిస్తూ.. వసూళ్లు

- ఐహెచ్‌ఆర్‌సీ పేరిట హాస్టళ్లలో తనిఖీలు
- సౌకర్యాలు లేవంటూ వార్డెన్ల నుండి డబ్బు డిమాండ్
- మూడు రోజులుగా జిల్లాలో హల్‌చల్
- కామేపల్లి వార్డెన్, హెచ్‌ఎం అప్రమత్తతో పోలీసులకు చిక్కిన బృందం

ఖమ్మంమయూరిసెంటర్: 'హలో ఎక్కడ ఉన్నారు.. నేను ఇండియా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర మహిళల సంరక్షణ అధ్యక్షురాలిని.. మీ వసతిగృహం వద్ద ఉన్నాను.. తనిఖీ చేయాలి.. త్వరగా రండి' అంటూ రెండు రోజుల క్రితం బోనకల్ లోని ఎస్సీ బాలికల వసతిగృహం సంక్షేమ అధికారికి ఓ మహిళ ఫోన్‌లో హుకుం జారీ చేసింది. దీంతో కంగుతిన్న అధికారి తాను బయట ఉన్నానని చెబుతూ అర గంటలో వెళ్లింది. ఈమేరకు రికార్డులు తనిఖీ చేశాక లోపాలు ఉన్నందున డబ్బులు ఇస్తే వెళ్లిపోతామని అనడంతో సదరు వార్డెన్ రూ.6 వేలు ఇవ్వగా తీసుకుని వెళ్లిపోయారు. ఇదే ముఠా మూడు రోజులుగా జిల్లాలోని పలు వసతిగృహాలకు వెళ్తుండగా వీరు వస్తున్న కారు, డాబూదర్పం చూసి అధికారులు హడలెత్తిపోతున్నారు. అయితే, కామేపల్లి గిరిజన ఆశ్రమ వసతిగృహానికి సోమవారం వెళ్లి ఇదే తరహాలతో వ్యవహరించగా.. అక్కడి నుంచి ఈ ముఠాను పోలీసులకు పట్టించింది.

వసతిగృహాలే లక్ష్యం...

వసతిగృహాలే లక్ష్యంగా ఓ మహిళ కొందరితో కలిసి తనిఖీల పేరుతో వసూళ్లకు తెరలేపినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ బాలికలు, మహిళల సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లోకి ప్రవేశిస్తున్నారు. ఇన్నోవా కారుకు ముందు హ్యూమన్ రైట్స్ అని ద్ద బోర్డు ఏర్పాటు చేసుకొని అట్టహాసంగా వసతిగృహాల్లోకి ప్రవేశిస్తుండగా.. సదరు మహిళతో పాటు ఆమె ఉంట ఉన్న వారి హడావుడి, అడుగుతున్న ప్రశ్నలతో అధికారులు హడలిపోతున్నారు. చివరకు అందిన కాడికి డబ్బు తీసుకుని చెక్కేస్తున్నారు. ఈ బృందం సభ్యులు శనివారం సాయంత్రం బోనకల్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహానికి వెళ్లేసరికి అధికారి లేకపోవడంతో మళ్లీ వస్తామని వెళ్లిపోయారు. కాగా, వీరు గురుకులం వైపు వెళ్లగా లోపలకు అనుమతించకపోవడంతో తిరిగి ఎస్సీ వసతిగృహానికి వచ్చారు. అప్పటికే అధికారి కూడా ఉండడంతో రికార్డులు పరిశీలించి అనేక లోపాలు ఉన్నాయంటూ అధికారిని భయపెట్టి డబ్బు వసూలు చేశారు. అలాగే, ఆదివారం కొణిజర్ల ఎస్సీ వసతిగృహానికి వెళ్లి బాత్‌రూమ్‌లు, గదులు పరిశీలించి వసతులు సక్రమంగా లేవని వార్డెన్‌ను బెదిరించారు. ఇంతలోనే ఈ బృందంలోని ఒకరిద్దరు వార్డెన్‌ను పక్కకు తీసుకెళ్లి ఎంతో కొంత ఇచ్చి సెటిల్ చేసుకోవాలని సూచించారు. కానీ వార్డెన్‌కు అనుమానం వచ్చిన యూనియన్ నాయకులకు చెబుతుండగా బృందం జారుకుంది.

రెండు రోజులు హడలిపోయిన వార్డెన్లు

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు వసతిగృహాల్లో తనిఖీలు చేస్తున్నారనే ప్రచారంతో సంక్షేమ అధికారులు హడలిపోయారు. అసలు ఈ బృందం ఎక్కడి నుంచి వచ్చింది, ఎందుకు తనిఖీలు చేస్తున్నారో తెలియక అయోమయంలో పడిపోయారు. ఆదివారం కొణిజర్ల వసతిగృహానికి వెళ్లాక సంక్షేమ అధికారుల యూనియన్ బాధ్యులతో పాటు జిల్లా అధికారికి సమాచారం ఇవ్వగా.. మిగిలిన అధికారులను అప్రమత్తం చేశారు. ఎవరు వచ్చి డబ్బు అడిగినా ఇవ్వకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని వార్డెన్ల వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్ పెట్టారు. ఇప్పటికే డైట్ బిల్లులు రాక అప్పుల పాలైన తమను డబ్బు కోసం బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంక్షేమ అధికారుల ఫోరం బాధ్యులు కోరారు.

అంతేకాక తల్లాడ, వైరా వసతిగృహాల వార్డెన్లను సైతం డబ్బు కోసం బెదిరించినట్లు తెలిసింది.

నివేదిక ఇవ్వొద్దంటే రూ.లక్ష కట్టండి



పాఠశాలలో కూరలను పరిశీలిస్తున్న స్రవంతి (ఎడమ చివర)

కామేపల్లి: ఇండియా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర మహిళల సంరక్షణ అధ్యక్షురాలినని చెబుతూ జర్పుల స్రవంతి తదితరులు సోమవారం కామేపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. హడావుడి చేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించడమే కాక తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఆపై హెచ్‌ఎం రమేష్, వార్డెన్ వసంతతో మాట్లాడారు. ఇదంతా మూడు గంటల పాటు సాగగా... పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైనట్లుగా నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని స్రవంతి హెచ్చరించగా, వార్డెన్, హెచ్‌ఎం కంగుతిన్నారు. ఇది జరగొద్దంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బృందంలోని ఒకరికి హెచ్‌ఎం రూ.2 వేలు ఫోన్ పే ద్వారా పంపినా వినకుండా రూ.20వేలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అనుమానం వచ్చిన వార్డెన్.. సీఐ తిరుపతిరెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి బృందాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాక ఎస్సై ప్రవీణ్‌కుమార్ విచారించారు. ఈ సందర్భంగా వీరంతా హ్యూమన్ రైట్స్‌కు సంబంధించిన వ్యక్తులు కాదని, ముఠాగా ఏర్పడి పాఠశాలల్లో తనిఖీల పేరిట బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని గుర్తించారు. ఒంగోలుకు చెందిన బాషా అనే వ్యక్తి స్రవంతి నుంచి రూ.లక్ష తీసుకుని ఆమెను తెలంగాణ అధ్యక్షురాలికి నియమించినట్లు చెబుతుండగా.. ఆమె వెంట ఉన్న వారికి రోజుకు రూ.500 ఇస్తూ తనిఖీలకు వెళ్తోందని తేలింది. ఈమేరకు వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదుతో జర్పుల స్రవంతితో పాటు భూక్యా వెంకటేశ్వర్లు, మల్రికంటి శేఖర్‌మాదిగ, షేక్ ఫరీద్, భూక్యా రెడ్యాపై కేసు నమోదు చేసి వారి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజశ్యామల యాగంలో మంత్రి తుమ్మల

సత్తుపల్లి: సత్తుపల్లిలోని శ్రీసచ్చిదానంద గణపతి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న రాజశ్యామల యాగంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. ఈసందర్భంగా సోమవారం రాత్రి పూర్ణాహుతి జరగగా వారు ప్రత్యేక పూజలు చేశారు. 108 రోజులు నిర్వహించే యాగంలో భాగంగా పదో రోజు దశమ మహావిద్యయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు చల్లగుళ్ల నర్సింహారావు, కిలారి వెంకటేశ్వరరావు, ఖాజా శ్రీనివాసరావు, కూసంపూడి నర్సింహారావు, వెల్ది జగన్మోహన్‌రావు, చింతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో మాటామంతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని 4, 5వ డివిజన్లలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. డివిజన్‌కు ఎంతమంది పని చేస్తున్నారు, ఎంత వేతనం వస్తోంది, సకాలంలో అందుతోందా, లేదా అని ఆరా తీశారు. కార్పొరేటర్ కమర్తపు మురళీ, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, జావీద్, హన్మంతరావు, పర్వతి శ్రీను, యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి



కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు

దుకాణంలో నగదు చోరీ

కామేపల్లి: దుకాణం తలుపులు పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో దాచిన నగదు చోరీ చేశారు. కామేపల్లి మండలం పండితాపురం సంత సమీపాన సాయిబాబా మందిరం ఎదురుగా ఉన్న నాగండ్ల జగదీష్ శ్రీ జగన్ ఎలక్ట్రానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ షాపు వెనుక తలుపును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి బీరువాలో దాచిన సుమారు రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సోమవారం ఉదయం షాప్‌కు వచ్చాక బాధితుడు గుర్తించాడు.

22 నుంచి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సత్తుపల్లి: మండలంలోని రుద్రాక్షపల్లిలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు దాసరి శ్రీలక్ష్మీరెడ్డి - జైపాల్‌రెడ్డి దంపతులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధానాచార్యులు దివ్విబాలాజీ రంగాచార్యస్వామి రుత్వికుల బృందంచే పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తమ స్వగ్రామంలో రామాలయం నిర్మించడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామంలో 65 ఏళ్ల నాటి రామాలయం శిథిలావస్థకు చేరగా, గ్రామస్తుల కోరిక మేరకు రూ.20 లక్షల సొంత నిధులతో పునరుద్ధరణ చేపట్టామన్నారు. ఇదిలా ఉండగా గతేడాది శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సక్రునాయక్, దేశ్‌బాయ్, హలావత్ అర్జున్, అంగోతు మధు, భాగ్యరాజు, ఏడుకొండలు, నవీన్, ఆనంద్, భాస్కర్‌రావు, సుధీర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీలక్ష్మీరెడ్డి - జైపాల్‌రెడ్డి, తదితరులు

మోడల్ స్కూల్ పిలుస్తోంది..

- ఉమ్మడి జిల్లాలో రెండు స్కూళ్లు
- ఆరో తరగతిలో చేరితే ఇంటర్ వరకు ఉత్తమ విద్య
- ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



కారేపల్లిలోని మోడల్ స్కూల్

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కొన్నేళ్ల కిందట మోడల్ స్కూళ్లను ప్రారంభించింది. ఈ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలతో వసతి కల్పించడమే కాక ఇంగ్లిష్ మీడియం విద్య బోధిస్తున్నారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో ప్రవేశానికి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో కారేపల్లి, పెనుబల్లి మండలాల్లో మాత్రమే మోడల్ స్కూళ్లు ఉండగా.. ప్రస్తుతం ఇందులో 1,214 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఆరో తరగతిలో ప్రవేశం

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు బోధన సాగుతోంది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక్కో తరగతికి వంద సీట్లు ఉంటాయి. అయితే, ఆరో తరగతిలో మాత్రమే పరీక్ష ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అనంతరం పదో తరగతి వరకు చదువుకోవచ్చు. కాగా, మిగతా తరగతుల్లో ఎవరైనా విద్యార్థులు వెళ్లిపోతే ఆ సీట్లు ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఇక పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన వారికి ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు, ఒక్కో గ్రూప్‌లో 40 మందిని తీసుకుంటారు. కాగా, మోడల్ స్కూళ్లలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనుండగా.. హాస్టల్ వసతి మాత్రం ఇంటర్ చదివే విద్యార్థినులకే మాత్రమే ఉంటుంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

2024 – 25వ విద్యాసంవత్సరానికి మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునేవారు http:/ telanganagms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలి. రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు. మిగతా తరగతుల్లో ఖాళీ సీట్లకు సైతం ప్రవేశపరీక్ష ద్వారానే అవకాశమిస్తారు. ఇక అనంతరం ఎస్సెస్సీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పించనున్నారు. కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులైతే రూ.125, ఇతరులైతే రూ.200ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

మూడు రోజులే గడువు

మోడల్ స్కూళ్లలో ప్రవేశపరీక్ష కోసం విద్యార్థులు ఈ నెల 22వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఈ పరీక్షలో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల జాబితా ను మే 25న విడుదల చేసి, మే 27 నుంచి 31వ తేదీ వరకు ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆసక్తి కలిగిన విద్యార్థులు మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వరకు అవకాశం ఉంది.

– ఈ.సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన డీసీసీబీ చైర్మన్

మధిర/ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దొండపాటి వెంకటేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ నేతి మురళీధర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వెంకటేశ్వరావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, రైతులకు మెరుగైన సేవలు అందించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. అనంతరం హైదరాబాద్‌లో రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు ఆధ్వర్యాన జరిగిన క్రెడిట్ పాలసీ సబ్ కమిటీ సమావేశంలో దొండపాటి పాల్గొన్నారు.



డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న టెస్కాబ్ చైర్మన్, ఎండీ

టీపీజేఎల్‌ఏ మహిళా అధ్యక్షురాలిగా దుర్గారాణి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్(టీజీజేఎల్‌ఏ) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగానే కాక లీగల్ అడ్వైజర్‌గా ఖమ్మంకు చెందిన న్యాయవాది రుద్రాక్ష దుర్గారాణి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమెకు రాష్ట్ర అధ్యక్షుడు పర్సా రమేష్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మల్లేష్, ప్రభాకర్, పి.శ్రీనివాస్, ప్రభుచౌదరి, నాగేశ్వరరావు, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న దుర్గారాణి

వివాహిత మృతిపై అనుమానాలు

అల్లుడి కుటుంబంపై తండ్రి ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో వివాహిత మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ ఆమె తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బోదులబండ గ్రామానికి చెందిన పొట్టపింజర విజయ్‌కుమార్‌కు కూసుమంచి మండలం నేలపట్లకు చెందిన మస్తాన్ కూతురు పూర్ణ(20)తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా పూర్ణను భర్త చిత్రహింసలకు గురిచేస్తుండడంతో పలుమార్లు పంచాయతీలు నిర్వహించారు. ఇంతలోనే ఆదివారం విజయ్ ఫోన్ చేసి పూర్ణ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మస్తాన్‌కు చెప్పాడు. కాగా, తన కుమార్తె మృతికి అల్లుడు, ఆయన కుటుంబ సభ్యులే కారణమని మస్తాన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెనుబల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన పెనుబల్లి గ్రామానికి చెందిన గొల్ల మందల లక్ష్మణరావు(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై గంగదేవిపాడు వైపు వెళ్తుండగా, గంగదేవిపాడు వైపు నుండి వీఎం.బంజర్ వైపు వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలు కాగా, పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న లక్ష్మణరావు సోమవారం మృతి చెందగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.



లక్ష్మణరావు (ఫైల్)